

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 17 నవంబరు 2024


కంపచెట్ల మధ్య శిథిలావస్థలో రాణిమహల్


ముళ్లపొదల మధ్యలో తాలింఖానా

పర్యాటక అభివృద్ధి ఇలాగేనా..?


రాణిమహల్, తాలింఖానాకు వెళ్లేదారిలో పెరిగిన ముళ్లచెట్లు

- గండికోటకు పెరుగుతున్న పర్యాటకులు
- దారిలేని రాణి మహల్
- చుట్టూ ముళ్లపొదలు
- తాలింఖాన్ భవనమూ ముళ్లపొదల్లో
- పడిపోతున్న పురాతన కట్టడాలు
- పర్యాటక ప్రాంతంపై నిర్లక్ష్యం
- పర్యాటకుల నుంచి గేటు వసూళ్లపై పలువురు ఆగ్రహం


బోర్డు దాటగానే గండికోటలో రాణి మహల్‌కు వెళ్లే దారి ఇలా..

పేరుగొప్ప ఊరుదిబ్బ అంటే ఇదేనేమో.. గండికోట ఘనమైన పేరు. దీనికి వేల ఏళ్ల ఘన చరిత్రా ఉంది. పక్కనే గ్రాండ్ కెనాన్ ఆఫ్ ఇండియాగా పిలిచే పెన్నాలోయా ఉంది. ప్రపంచంలోనే ఇది రెండోది. ఆసియా ఖండంలో ఉన్న ఒకే ఒక్కలోయ ఇది. చారిత్రక ప్రాధాన్యమున్న కోటను, సహజసిద్ధంగా ఏర్పడిన పెన్నాలోయను చూసేందుకు వారాంతాల్లో ఇక్కడకు పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. వీరు వచ్చే వాహనాలకు గేటు వసూలు చేయడం.. చివరకు మనుషులకూ గేటు బలవంతంగా గుంజుకోవడంలో ఉండే శ్రద్ధ.. సౌకర్యాల కల్పనలో లేదని పలువురు విమర్శిస్తున్నారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న రాణిమహల్, తాలింఖానాలు శిథిలావస్థలో ఉన్నాయి. వీటిని చూసేందుకు వెళ్లాలన్నా దారి లేదు. దీంతో పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకంపై పాలకులకు, అధికారులకు ఉండే చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు.

జమ్మలమడుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోట నిర్లక్ష్యానికి గురవుతోంది. గండికోట పరిసర ప్రాంతాల్లో పర్యాటకులకు మంచినీటి వసతి సైతం లేదు. వచ్చిన ప్రతి ఒక్కరు మంచినీళ్ల బాటిళ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కోట బయట ప్రాంతంలో వివిధ దుకాణాలు, రిసార్టులు వెలిశాయి. లోయ పరిసర ప్రాంతాల్లో మాత్రం పర్యాటకులకు ఎలాంటి వసతులు లేవు. జమ్మలమడుగు నుంచి గండికోటకు సుమారు 14 కి.మీ దూరం ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆర్టీసీ బస్సు సర్వీసులు ఉన్నాయి. మిగతా సమయాల్లో ఎవరు వెళ్లాలన్నా తిరుగు ప్రయాణం చేయాలన్నా సొంత వాహనాలు ఉండాల్సిందే. లేదంటే ఆటోలే గతి. ఒక్కోసారి ఆటోలు ఉండవు. అలాంటి సమయంలో గంటకు పైగా వేచి ఉండాల్సిందే.

గండికోట ఆహ్లాదకరంగా ఉంటుంది. సహజసిద్ధంగా ఏర్పడిన పెన్నా లోయకు గ్రాండ్ కెనాన్ ఆఫ్ ఇండియాగా పేరుంది. ఇది దాదాపు 300 అడుగుల లోతులో 250 అడుగుల వెడల్పుతో కిలోమీటరుకు పైగా ప్రవాహం ఉంటుంది. చారిత్రక ప్రాశస్త్యం ఉన్న క్రీ.శ. 11వ శతాబ్దం నాటి రంగనాథస్వామి దేవాలయం, మాధవరాయస్వామి దేవాలయం ఉన్నాయి. ఇప్పటికీ చెక్కుచెదరని దాదాపు 60 అడుగుల ఎత్తున్న ధాన్యాగారం ఉంది. జుమ్మామసీదు, బందిఖానా, చార్మినార్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. ఇవన్నీ గండికోట ఊరును ఆనుకునే ఉన్నాయి.

దారిలేని రాణిమహల్

జుమ్మా మసీదు ధాన్యాగారానికి వెనుకభాగంలో రాణి మహల్, తాళింఖానా, గన్‌పౌండ్రీ, నదివైపు ప్రవేశద్వారం ఉన్నాయి. ఈ మేరకు జుమ్మామసీదు పక్కనే అధికారులు బోర్డు కూడా ఏర్పాటు చేశారు. అయితే పర్యాటకులు అక్కడికి వెళ్లాలన్నా చుట్టూ ముళ్లపొదలు, గుంతలు, పెద్ద పెద్ద రాళ్లు దర్శనమిస్తున్నాయి. అక్కడికి చేరుకోవాలంటే రాళ్లరప్పలు దాటుతూ కంపచెట్లలో ముళ్లను తప్పించుకుంటూ పెద్ద సాహసమే చేయాలి. ఇంత వ్యయప్రయాసలకు ఓర్చి అక్కడికి వెళితే.. శిథిలమైన కట్టడాలు మాత్రమే ఉన్నాయి. పోనీ వాటినైనా దగ్గరగా పరిశీలిద్దాం అంటే ఏమాత్రం వీలుకాదు.. పెద్దపెద్ద కంపచెట్లు శిథిల భవనాల చుట్టూ పెరిగిపోయాయి. గండికోటకు ఆదరణ పెరుగుతోంది. శనిఆదివారాల్లో ఇక్కడకు వేలల్లో పర్యాటకులు వస్తున్నారు. వీరిదగ్గర నుంచి గేటు వసూలు చేసే శ్రద్ధ పురాతన కట్టడాల వద్దకు దారి ఏర్పాటులో చూపడం లేదని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. రాణిమహల్, తాలింఖానా వద్దకు రోడ్డు ఏర్పాటు చేయాలని ఎక్స్‌కవేటర్‌తో ముళ్లపొదలు తొలగించాలని కోరుతున్నారు. అలాగే జుమ్మా మసీదు ముందుభాగంలో కత్తుల కోనేరు (ఎర్రకోనేరు) ఉంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఇందులో జంబు పెరిగిపోయింది. కోనేటి కట్టడంలోని రాళ్లు పడిపోతున్నాయి. రోప్‌వే పనులు పూర్తిగా నిలిచిపోయాయి. సహజసిద్ధంగా లోయ ఏర్పడిన ప్రాంతంవైపు పర్యాటకులకు రక్షణ లేదు.



రాణిమహల్, తాలింఖానా, గన్‌పాండ్రీ, నదివైపు పోవు దారి.. అంటూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

మనిషికి రూ.20 చొప్పున గేటు వసూళ్లు..!

ఇన్ని సమస్యలు ఉన్నప్పటికి గండికోట గ్రామానికి ముందు భాగంలో గేటు వసూళ్లను ఇటీవల ప్రారంభించారు. లారీకి రూ.150, బస్సుకు రూ.100, ఆటోకు రూ.20, ద్విచక్ర వాహనాలకు రూ.20, పార్కింగ్‌కు రూ.30 వసూలు చేస్తున్నారు. వాహనాలకు డబ్బులు వసూలు చేయడం సరే.. వాహనాల్లో వచ్చే మనుషులకూ ఒక్కొక్కరికి రూ.20 వసూలు చేస్తుండటం విశేషం. ఇంతదూరం శ్రమకోర్చి వచ్చిన వారు ఇక వెనుదిరిగి వెళ్లలేక మనిషికి రూ.20 చొప్పున సమర్పించుకుంటున్నారు. ఇప్పటికైనా గేటు వసూళ్లు రద్దు చేయాలని, సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.



గేటు వసూళ్ల టికెట్లు


గండికోట ఊరి వెలుపల గేటు వసూళ్లకు ఏర్పాటు చేసిన షెడ్డు


స్ఫూర్తిదాయకం

స్ఫూర్తిదాయకం యువ ఉత్సవ్ : వీసీ


కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): యువ ఉత్సవ్ కార్యక్రమం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందని.. వారిలోని ప్రతిభాపాటవాలను వెలికితీసేందుకు ఉపయోగపడుతుందని వైవీయూ వీసీ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం వైవీయూలో భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్-2024 నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువతరం సానుకూల దృక్పథంతో ఈ పోటీ ప్రపంచంలో రాణించాలన్నారు. యువ ఉత్సవ్‌లో వచ్చిన అవకాశాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పద్మ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే గెలుపోటములు సమానంగా స్వీకరించాలని యువతకు సూచించారు. జిల్లా యువత రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలన్నారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి కె.మణికంఠ, స్టెప్ సీఈవో సాయిగ్రేస్, కల్చరల్ కోఆర్డినేటరు విజయభారతి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటరు వెంకటరామిరెడ్డి ప్రసంగించారు. కాగా.. యువ ఉత్సవ్‌లో భాగంగా యువత పెద్దఎత్తున పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ, పద్య పఠన, ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొన్నారు. యువ ఉత్సవ్‌లో భాగంగా యువత చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. జానపద, సంప్రదాయ నృత్యాల్లో 15 టీఎంలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన యువత పాల్గొన్నారు.





పెద్దదర్గాలో గంధ పరిమళం

- ప్రారంభమైన ఉరుసు మహోత్సవాలు


పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలలో భాగంగా దీక్షలో కూర్చున్న మలంగ్‌షా

కడప కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గా ఉరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అక్కడ ఇసుక వేస్తే రాలనంత జనం. అంతటా ఆధ్యాత్మిక సుగంధం.. అందరి మనసుల నిండా భక్తి పారవశ్యం నెలకొంది. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా మహమ్మద్ మహమ్మదుల్ ఆరీఫుల్లా హుసేని చిష్టివుల్ ఖాద్రి సాహెబ్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. ఈ సందర్భంగా రాత్రి 8 గంటలకు మలంగ్‌షాను పీఠాధిపతి స్వయంగా దీక్షలో కూర్చోబెట్టారు. రాత్రి పీఠాధిపతి గంధం కలశాన్ని ఫకీర్లమేళతాళాల మధ్య ఊరేగింపుగా దర్గాలోని గురువుల మజార్ల వద్దకు తీసుకొచ్చారు. పీఠాధిపతి స్వయంగా గురువు మజార్ వద్ద ప్రార్థనలు చేసి గంధం సమర్పించి ఫతేహా చేశారు. ప్రముఖ సినీ సంగీత దర్శకులు ఏఆర్ రెహ్మాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఖవ్వాలి కచేరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉరుసు ఉత్సవాల కోసం దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో దర్గా పరిసరాల రోడ్లన్నీ రద్దీగా మారాయి. పలువురు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు గంధం ఉత్సవంలో పాల్గొన్నారు. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి గంధోత్సవంలో పాల్గొని చాదర్ సమర్పించారు. కాగా.. పెద్దదర్గా ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం 4-30 గంటలకు సినిమా హీరో రామ్‌చరణ్ కడపకు రానున్నారని మెగా ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు తాజ్ షరీఫ్ వెల్లడించారు. పెద్దదర్గా మహోత్సవాలలో జరుపతలపెట్టిన 80వ నేషనల్ ముషాయిరా గజల్ ఈవెంట్‌ను రామ్‌చరణ్ ప్రారంభిస్తారన్నారు.


పెద్ద దర్గాలో ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి


పూలచాదర్ తీసుకొస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి

19న వైఎస్ షర్మిల రాక




(కడప-ఆంధ్రజ్యోతి): పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఈ నెల 19న జిల్లాకు రానున్నారు. ఈ మేరకు ఆమె పర్యటన ఖరారైంది. 19న మధ్యాహ్నం 12.40కి కడప విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వెళతారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో సమావేశం అవుతారు. జిల్లాలో రాజకీయ పరిస్థితులపై చర్చిస్తారు. 5.30కు పెద్దదర్గాను విజిట్ చేయనున్నారు. 6గంటలకు బయల్దేరి ఇడుపులపాయ ఎస్టేట్‌కు చేరుకుంటారు. 20వ తేదీ కడపకు వచ్చి 12గంటలకు కలెక్టరును కలుస్తారు. అనంతరం ప్రెస్‌మీట్ నిర్వహిస్తారు. 3.55కు హైదరాబాదు బయల్దేరుతారు.

జిల్లా వ్యాప్తంగా 415మి.మీ వర్షపాతం



కడప కలెక్టరేట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం వల్ల జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 415 మి.మీ వర్షపాతం నమోదైంది. పులివెందులలో 28 మి.మీ వర్షపాతం నమోదు కాగా.. బద్వేలు, మైదుకూరులో 25 మి.మీ వర్షం కురిసింది. అలాగే కడప డివిజన్ పరిధిలోని వల్లూరులో 24.2 మి.మీ, జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని యర్రగుంట్లలో 12.6 మి.మీ వర్షం కురిసింది. పులివెందుల నియోజకవర్గంలో చక్రాయపేట, వేంపల్లి మినహా అన్ని మండలాల్లో వర్షం కురిసింది.



ఐదేళ్ల జగన్ అండ్ కో పాలనలో కొందరు చెలరేగిపోయారు. తాడేపల్లి కేంద్రంగా ఇచ్చే చిల్లర డబ్బుల కోసం ఆశపడి వైసీపీ సోషల్ మీడియాలో ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేస్తూ నీచాతినీచంగా పోస్టులు పెట్టారు. వీరు ఎంతగా దిగజారారంటే. చివరకు జగన్ సొంత తల్లి విజయమ్మ, చెల్లెళ్లు షర్మిల, సునీతలపైనే నీచంగా పోస్టులు పెట్టారు. ఆ పోస్టులు చూసి వైసీపీ అంటేనే సోషల్ మీడియా ఉన్మాదుల పార్టీ అని పేరు తెచ్చుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొద్దిరోజులు సైలెంట్‌గా ఉండి మళ్లీ ఉన్మాద మూక చెలరేగిపోయింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనిత కుటుంబ సభ్యులపై ఇష్టారాజ్యంగా పోస్టులు పెట్టడంతో ఇప్పుడు చర్యలు ప్రారంభమయ్యాయి. వైసీపీ సోషల్ మీడియా ఉన్మాదుల కోసం పోలీసులు వేట మొదలుపెట్టారు.



వైసీపీ ఉన్మాదుల కోసం వేట

- బూతు కంటెంట్ పోస్టులు..
- మార్ఫింగ్ వీడియోలు పెట్టినవారే టార్గెట్
- ఇప్పటికే 48మందికి పైగా గుర్తింపు
- రాష్ట్రవ్యాప్తంగా 20 చోట్లకు పైగా కేసులు నమోదు
- అవన్నీ పులివెందులకు బదిలీచేసే యత్నం
- మరోసారి ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డికి నోటీసు
- మరో ఐదుగురికి కూడా..
- సోషల్ మీడియా ప్లాట్‌ఫాంపై పోలీసుల నిఘా

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియాలో వర్రా రవీంద్రరెడ్డి నీచమైన పోస్టులు పెట్టేవాడు. ఇతనిపై వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇక సింహాద్రిపురం మండలంలో హరి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పులివెందులలో వర్రా రవీంద్రరెడ్డి, వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవరెడ్డి, అర్జున్‌రెడ్డిలపై పోలీసులు ఎస్సీ ఎస్టీ కేసు పెట్టారు. దీంతో ఒక్కసారిగా వైసీపీలో కలవరం రేగింది. ఇక వర్రాను అరెస్టు చేసి సెంట్రల్ జైలుకు తరలించారు. అతని వాంగ్మూలం మేరకు పోలీసులు పలువురికి నోటీసులు ఇస్తున్నారు. సజ్జల భార్గవరెడ్డి డైరెక్షన్‌లో పోస్టులు పెట్టినట్లు వర్రా వాంగ్మూలం ఇచ్చాడని డీఐజీ కోయ ప్రవీణ్ ఇప్పటికే వెల్లడించారు. ఈ నేపథ్యంలో వర్రా పోస్టులను 48మందికి పైగా షేర్ చేశారని పోలీసులు గుర్తించారు. వారందరికీ 41ఏ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇక సజ్జల భార్గవరెడ్డి, ఇంకొందరికోసం వేట కొనసాగిస్తున్నారు. తాజాగా మరోసారి ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డికి నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు. అయితే రాఘవరెడ్డి పరారీలో ఉన్నారు. ముందస్తు బెయిలు కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం విచారణ ఉంది. ఈ కేసుకు సంబంధించి పులివెందుల పోలీసులు శనివారం రాఘవరెడ్డి ఇంటి గోడకు నోటీసు అంటించారు. ఇక వైసీపీ సోషల్ మీడియా కన్వీనరుగా ఉంటున్న వివేకానందరెడ్డి, అర్జున్‌రెడ్డిల ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చారు. కాశినాయన మండలంలోని అమగంపల్లెకు చెందిన వరకుమార్‌కు నోటీసులు ఇచ్చారు. చిన్నచౌకు పోలీసులు సునీత అనే మహిళకు నోటీసు ఇచ్చేందుకు వెళ్లగా ఆమె అందుబాటులో లేరని సమాచారం.

వరుసగా నోటీసులు

సోషల్ మీడియాలో బూతు కంటెంట్, అశ్లీల పోస్టులు చేస్తున్న వారి ఆట కట్టించాలని సీఎం చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారు. వైసీపీ సోషల్ మీడియా తాడేపల్లి కేంద్రంగా పనిచేస్తోంది. అందులో ఉన్న కీలక వ్యక్తులంతా కడప జిల్లా వారే. వీరందరికీ 41ఏ నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇక ఉమ్మడి జిల్లాలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి అనుచరుడు రాఘవరెడ్డి బృందంపై పలు కేసులు నమోదయ్యాయి. చిత్తూరు, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో కూడా కేసులు వచ్చాయి. దాదాపు 20కి పైగా కేసులు ఉన్నాయి. వీరందరికీ పులివెందుల పోలీసులు నోటీసులు జారీ చేయనున్నారు. నోటీసులు అందుకున్న వారంతా విచారణకు వస్తే.. అసలు దోషులెవరో తేలనుంది.

అకౌంటు క్లోజ్

వైసీపీ హయాంలో తాడేపల్లి నుంచి వచ్చే జీతాలకు పనిచేస్తూ ప్రతిపక్ష నేతలపై సోషల్ మీడియాలో విషం కక్కారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా మమ్మల్ని ఏం చేయలేరనే ధీమాతో ఎగిరెగిరి పడ్డారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంతో కొందరు సోషల్ మీడియాలో అకౌంట్లు క్లోజ్ చేసి పోలీసుల నుంచి తప్పించుకుని బతుకుజీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

పోలీసుల నిఘా

సోషల్ మీడియాలో బూత్ కంటెంట్, మార్ఫింగ్, విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టినవారి కోసం పోలీసులు గట్టి నిఘా పెట్టారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, ఇతర గ్రూపులపై సైబర్ క్రైం నిఘా పెట్టింది. అనుచిత పోస్టులు పెట్టిన వారి కోసం అన్వేషిస్తోంది. జుగుప్సాకర పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు.

ప్రాణాలు తీస్తున్న ఒత్తిడి



- ఆత్మహత్యకు పాల్పడుతున్న వైనం
- ప్రతిరోజూ మానసిక వైద్యుని వద్దకు పదుల సంఖ్యలో విద్యార్థులు
- మార్కులు, ర్యాంకుల లక్ష్యాలే సమస్యలు

6

నా భర్త నిర్దోషి



- వర్రా రవీంద్రరెడ్డి భార్య వర్రా కళ్యాణి

కడప మారుతీనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తన భర్త వర్రా రవీంద్రరెడ్డి నిర్దోషి అని ఫేస్‌బుక్‌లో ఎలాంటి తప్పుడు పోస్టులు పెట్టకపోయినా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వర్రా కళ్యాణి పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల తప్పులను తన భర్త ప్రశ్నించారనే నెపంతో బలవంతంగా అదుపులోకి తీసుకుని చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రధానంగా తన భర్త పేరుతో ఇతరులు చేసిన పోస్టుల కారణంగా అరెస్ట్ చేయడం సరైందికాదన్నారు. పోలీసులతో తన భర్తకు ఎలాంటి వైరం లేదన్నారు. నిర్దోషి అయినప్పటికీ టీడీపీ నాయకుల వత్తిడి కారణంగా అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ మేరకు ఆమె శనివారం కడప ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన భర్తను అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి చిత్రహింసలకు గురిచేసి ఏకంగా ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించి పోలీసులకు అనుకూలంగా వాంగ్మూలం తీసుకున్నారని ఆరోపించారు. ఇదే విషయం మెజిస్ట్రేట్ ముందు చెప్పారన్నారు. చట్టవిరుద్ధంగా తన భర్తను అదుపులోకి తీసుకుని చిత్రహింసలకు గురిచేయడం దారుణమన్నారు. ఈ విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పాలస్తీనాపై నరమేధం ఆపాలి

7


పాలస్తీనాకు మద్దతుగా నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎస్.వేణుగోపాల్

అలుపెరగని అయ్యవారు

- నిత్యం బడినామస్మరణే
- ఎక్కడ పనిచేసినా తనదైన ముద్ర
- పిట్టిగుంటలో విద్యార్థుల సంఖ్య 3 నుంచి 103కు చేర్చిన ఘనత
- తన జీతంతో వలంటీర్ల ఏర్పాటు
- సొంతడబ్బు, దాతల సహకారంతో సౌకర్యాలు



చెట్టుకింద పాఠాలు బోధిస్తున్న రమణారెడ్డి (ఫైల్)

కాశినాయన, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం అంటేనే ఇలా వచ్చామా.. అలా వెళ్లామా అనేతీరులో పనిచేసేవారే ఎక్కువ. అందుకు భిన్నంగా విధులు నిర్వహిస్తూ పలువురి మన్ననలను పొందుతున్న అలుపెరగని అయ్యవారు గానుగపెంట రమణారెడ్డి. కాశినాయన మండలం చెన్నారెడ్డిపల్లెలోని దిగువ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రమణారెడ్డి విద్యాభ్యాసం అంతా సర్కారు బడుల్లోనే సాగింది. 1998లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మొదట కవలకుంట్ల ప్రాథమిక పాఠశాలలో బాధ్యతలు స్వీకరించి బదిలీ అయ్యేనాటికి ఆ పాఠశాలను ఉన్నత పాఠశాల స్థాయికి తీర్చిదిద్దారు.

మూతబడే పాఠశాలల ఎంపిక

ప్రభుత్వ బదిలీల్లో భాగంగా మంచి పాఠశాలల్లో పోస్టింగ్ వచ్చే అవకాశం ఉన్నా మూరుమూల పల్లెల్లో మూతబడే దశలో ఉన్న పాఠశాలనే ఎంపిక చేసుకోవడం రమణారెడ్డి ప్రత్యేకత. పాఠశాల పురోగతిలోకి రాకపోతే చెడ్డపేరు వస్తుందని తోటి మిత్రులు, సహచర ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు వారించినా మొండిగా ముందుకెళ్లి పాఠశాల స్థితిగతులను మార్చి తానేంటో నిరూపించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఉప్పలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరే నాటికి అక్కడ విద్యార్థుల సంఖ్య కేవలం 14 మంది. తనదైన రీతిలో విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామాగ్రి, నోట్‌పుస్తకాలు, అవసరమైన బోధనోపకరణాలు, దుస్తులు అందించడంతో పాటు నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ బోధనచేయడంతో అక్కడ విద్యార్థుల సంఖ్య 54కు చేరింది. దీంతో రమణారెడ్డికి ఉపాధ్యాయలోకంలో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అనంతరం 2017లో ప్రభుత్వ బదిలీల్లో మంచి పాయింట్లతో కోరుకున్న పాఠశాలలో పోస్టింగ్ లభించే అవకాశం ఉన్నప్పటికీ ముగ్గురు విద్యార్థులతో మూతబడే దశలో ఉన్న పిట్టిగుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంచుకున్నారు. గ్రామంలో కలియతిరిగారు. పోరుమామిళ్ల, కలసపాడు లాంటి పట్టణాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. సర్వం తానే బాధ్యత తీసుకుంటాను అంటూ వారికి నమ్మకం కలిగించారు. విద్యార్థుల సంఖ్యను 25కు పెంచారు. సొంత ఖర్చులతో ముగ్గురు వలంటీర్లను ఏర్పాటు చేసుకుని ఉదయం పాఠశాల సమయంకంటే ముందు స్టడీ అవర్స్ పెట్టారు. సెలవుదినాల్లో బడి నిర్వహించేవారు. వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం 6గంటల నుంచి 8గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. గణితం, సైన్సు, ఇంగ్లీషులో ప్రత్యేక శిక్షణ, వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కరోనా సమయంలో రాష్ట్రమంతటా పాఠశాలలు మూతబడినా పిట్టిగుంట ప్రాథమిక పాఠశాలలో రోజుకు ఒక తరగతి చొప్పున పిలిపించుకుని పాఠాలు బోధించారు. విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు పెరిగాయి. మండలంలో ఏ పోటీ పరీక్షలు నిర్వహించినా రమణారెడ్డి పాఠశాలలో చదివే విద్యార్థులే ప్రథమస్థానంలో నిలిచేవారు. సొంత నిధులతో పాటు దాతల సహకారంతో కంప్యూటర్, టీవీ, లైబ్రరి, బోధనోపకరణాలు సమకూర్చారు. ప్రారంభంలో సరిపడిన గదులు లేకపోయినా చెట్టుకిందనే పాఠాలు బోధించేవారు. దాతల సహకారంతో ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేయించారు. పాఠశాలలో స్కూల్‌డేలు, జాతీయ పర్వదినాలు నిర్వహించేవారు. దీంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా 103కు చేరింది. మీడియాలో సక్సెస్ కథనాలు అనేకం ప్రచురితమయ్యాయి. దీంతో రాష్ట్రమంతా పిట్టిగుంట ప్రాథమిక పాఠశాల వైపు చూసేలా చేశారు. దీన్ని ఒక కేస్‌స్టడీగా తీసుకుని రాష్ట్రస్థాయి కమిటీలు వచ్చి పరిశీలించి పోయాయి. ఇప్పటికీ ఈ కార్యక్రమాలన్నీ ఈ పాఠశాలలో కొనసాగుతున్నాయి.

ప్రాథమికోన్నత స్థాయికి పెంపు

ఒకే గదితో ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలగా ఉన్న పిట్టిగుంట స్కూల్‌కు ప్రభుత్వం అదనంగా 4 ఉపాధ్యాయ పోస్టులు మంజూరుచేసింది. విద్యార్థుల సంఖ్య పెరగడంతో ప్రాథమికోన్నత పాఠశాలగా రమణారెడ్డి అప్‌గ్రేడ్ చేయించారు. అదనపు తరగతి గదులు కూడా మంజూరయ్యాయి.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు

నిత్యం పాఠశాల స్మరణతో పాటు.. బోధనే వృత్తి, ప్రవృత్తిగా మలుచుకుని విధులు నిర్వహిస్తున్న గానుగపెంట రమణారెడ్డికి అవార్డుల పంట పండిందనే చెప్పాలి. ఉప్పలూరులో పనిచేస్తున్నప్పుడు 2015లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా, 2022లో పిట్టిగుంట పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఇతని సేవలు గుర్తించిన ఒంగోలు జిల్లాకు చెందిన ఆదరణ సొసైటీ, భద్రాచలానికి చెందిన ఓసీ సంఘంతో పాటు పలు సంస్థలు సన్మానం చేశాయి.



ఉదయం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గానుగపెంట రమణారెడ్డి

విద్యార్థులకు న్యాయం చేయడమే లక్ష్యం



ప్రైవేట్ పాఠశాలలపై మోజుతో విద్యార్థులు పట్టణాలకు పరుగులు పెడుతున్న ఈ రోజుల్లో నన్ను నమ్ముకొని ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నదే నాలక్ష్యం. సొంత డబ్బుతో పాటు దాతల సహకారంతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చుకుని వారి సమగ్రాభివృద్ధికి పాటుపడటం నాకు ఎంతో తృప్తినిస్తుంది.

- గానుగపెంట రమణారెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పిట్టిగుంట ప్రాథమికోన్నత పాఠశాల

సంఘమిత్ర నియామకంపై విచారణ గందరగోళం



ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి

తంబళ్లపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు సంఘమిత్రగా సుజన నియామకంపై శనివారం అధికారులు చేపట్టిన విచారణ గందరగోళంగా మారింది. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు సంఘమిత్రగా పనిచేస్తున్న వసంతకుమార్‌రెడ్డి కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన స్థానంలో ఈ ఏడాది ఆగస్టులో అదే గ్రామానికి చెందిన సుజన ఎన్నికై విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా సంఘమిత్రను ఎన్నుకున్నారని, ఆమె నియామకం రద్దు చేయాలని కొద్ది రోజుల క్రితం కన్నెమడుగుకు చెందిన ఓవర్గం మహిళా సభ్యులు రాయచోటిలో కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టరు పీడీని ఆదేశించడంతో శనివారం డీపీఎంలు లక్ష్మీప్రసాదరెడ్డి, వేణుమాదవ్, ఏపీఎం గంగాధర్‌లు స్థానిక వెలుగు కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘమిత్రను తొలగించి మరొకరిని నియమించాలని పట్టుబట్టడంతో గందరగోళం ఏర్పడింది. దీంతో డిసెంబరు 3వ తేదీ విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో పలువురు మహిళా సభ్యులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి సిబ్బందితో వచ్చి అనుమతి లేకుండా రోడ్డుపై బైఠాయించడం తగదని, చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు ఆందోళన చేస్తున్న మహిళలకు మద్దతు పలికారు. కాగా ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్తున్న తమను అడ్డగించి అనుచితంగా ప్రవర్తించారని టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, సురేంద్ర వైసీపీ నాయకులు మదనమోహన్‌రెడ్డి, చౌడేశ్వర, కేఆర్‌మల్‌రెడ్డి, లక్ష్మీరెడ్డిలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ధర్నాలో పాల్గొని ఉద్యోగాలను దుర్వినియోగం చేసి, తమను అడ్డగించిన అంగన్వాడీలపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇది రాజకీయ రంగు పులుముకుంది.

ప్రాణాలు తీస్తున్న ఒత్తిడి



- ఆత్మహత్యకు పాల్పడుతున్న వైనం
- ప్రతిరోజూ మానసిక వైద్యుని వద్దకు పదుల సంఖ్యలో విద్యార్థులు
- మార్కులు, ర్యాంకుల లక్ష్యాలే సమస్యలు
- తల్లిదండ్రుల్లో మార్పు రావాలంటున్న వైద్యులు

"మంచి ర్యాంకు కోసం కష్టపడి చదివాను ఈ మధ్య ఎందుకో బాగా చదవలేకపోతున్నా అనిపిస్తుంది. నాన్న చెప్పిన ర్యాంకు వస్తుందో లేదోనని భయం వేస్తోంది. నిద్రపట్టడంలేదు. ఆకలి అనిపించడంలేదు. ఇంట్లో వాళ్లకి చెప్పలేకపోతున్నా. ఏం చేయాలో అర్థం కావడం లేదు"- ఇది వైద్యుని వద్ద ఓ ఇంటర్ విద్యార్థి ఆవేదన. ఇది ఒక్క విద్యార్థి సమస్య మాత్రమే కాదు.. వేలమంది విద్యార్థుల సమస్య. లక్షల్లో ఫీజులు దండుకునే ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకే కాదు.. అల్లారుముద్దుగా పెంచుకునే తల్లిదండ్రులకూ మార్కులు, ర్యాంకులే లక్ష్యం కావడంతో ఆ ఒత్తిడి అంతా పిల్లలపై పడుతోంది. దీంతో కొందరు ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుండగా మరికొందరు డిప్రెషన్‌లోకి వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల తల్లిదండ్రులు మేలుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై మార్కులు, ర్యాంకులు ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో విద్యార్థులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. గతంతో పోలిస్తే ఈ తరహా సమస్యలతో బాధపడుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తమ బాధను ఎవరికీ చెప్పుకోలేక కొంతమంది మానసికంగా వేదన అనుభవిస్తున్నారు. డాక్టరు, ఇంజనీరు కావాలి. అందుకను గుణంగా చదివి ర్యాంకు సంపాదించాలి. ఇదే చాలామంది తల్లిదండ్రులు లక్ష్యం. తమ లక్ష్యాన్ని బలవంతంగా పిల్లలపై రుద్దుతున్నారు. కొందరు లక్షలాది రూపాయలు అప్పు చేసి చదివిస్తున్నారు. జాగ్రత్తగా చదువుకో అంటూ మరికొందరు తల్లిదండ్రులు తమకు తెలియకుండానే పిల్లలపై వత్తిడి తీసుకువస్తున్నారు. ఆ బరువు మోసే యత్నంలో శక్తి సరిపోక కొంతమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తరగతిలో వెనుకబడినా.. మంచి ర్యాంకులు రాకపోయినా తరగతి గదిలో టీచర్లు అవమానకరంగా మాట్లాడినా భరించలేక ఎంతో మంది విద్యార్థులు డిప్రెషన్‌లోకి వెళుతున్నారు. ఒకసారి డిప్రెషన్‌లోకి వెళ్లిన విద్యార్థులు బయటికి రావడం కష్టమని, వారంతా ఈ జీవితం ఎందుకనే భావనతో బతుకుతుంటారని వైద్యులు చెబుతున్నారు.

రెండు ఉదాహరణలు..

- మార్కులు తక్కువ వస్తాయన్న దిగులుతో 2019 ఆగస్టులో కడప ఎన్జీవో కాలనీలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. అయితే అధ్యాపకుల వేధింపుల వల్లనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని బాలుడి తండ్రి అప్పట్లో ఆరోపించారు.
- 2022 మార్చిలో అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం ఎర్రగుంట్ల గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థిని (15) ఆత్మహత్య చేసుకుంది. హాస్టలు గదిలో విష ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించగా వెంటనే కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ విద్యార్థిని మృతిచెందింది. సరిగా చదవలేకపోతున్నానంటూ విద్యార్థిని సూసైడ్ నోట్ రాసింది. తమ కుమార్తె కొన్ని సబ్జెక్టులు చదవలేక వెనుకబడి ఉండడం వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి



విద్యార్థులను చిన్నప్పటి నుంచే హాస్టళ్లలో చేర్పించి చదివించాలని భావించే తల్లిదండ్రులు వారి మానసిక శారీరక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లలకు లక్ష్యాలు పెట్టకుండా వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించే ప్రయత్నం చేయాలి. అంతేకానీ ముందు నుంచే డాక్టరు కావాలి, ఇంజనీరు కావాలి, ఐఏఎస్, ఐపీఎస్ అంటూ లక్ష్యాలు విధించడం ద్వారా ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. గొప్పగొప్ప స్థానాలకు వెళ్ళిన వారు.. వారి ఇష్టపూర్వకంగా ఆయా రంగాలను ఎంచుకున్న వాళ్లే తప్ప తల్లిదండ్రుల ఒత్తిడితో ఎదిగిన వారు కాదనే విషయం గుర్తుచేసుకోవాలి. ఈ విషయంలో తల్లిదండ్రుల్లో తప్పనిసరిగా మార్పు రావాలని ర్యాంకులు, మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచవద్దని నిపుణులు చెబుతున్నారు. స్పెషల్ క్లాసులు, ట్యూషన్లు అంటూ ఒత్తిడికి గురిచేస్తే విద్యార్థి మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందంటున్నారు. ఇంజనీరింగ్, డాక్టరు మాత్రమే కాదు, ఎన్నో రంగాల్లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలంటున్నారు. విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురయ్యేలా చేస్తున్నది తల్లిదండ్రులేనని వారిలో మార్పు రావలసిన అవసరం ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

కౌన్సెలింగ్ కేంద్రాలు ప్రశ్నార్థకం..

ప్రతి కళాశాలలో విద్యార్థులకు కౌన్సెలింగ్ చేసేందుకు అనుగుణంగా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రం సూచించింది. అయితే ఏ కళాశాలలోనూ ఈ తరహా కేంద్రాలను ఏర్పాటు చేయలేదని చెప్పవచ్చు. ఈ కేంద్రాలు ఉంటే రోజువారి యాక్టివిటీస్‌కు భిన్నంగా ఉండే విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుంది.

కౌన్సెలింగ్‌కు వస్తున్న వారిలో విద్యార్థులు ఎక్కువ..



ఈ మధ్యకాలంలో కౌన్సెలింగ్‌కు వస్తున్న వారిలో విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారు. నిద్రపట్టడం లేదని, కన్నుమూస్తే ర్యాంకులు, మార్కులు కనిపిస్తున్నాయని, ఆకలి లేదని, చనిపోవాలనిపిస్తుందంటూ కొంతమంది విద్యార్థులు చెబుతున్నారు. పరీక్షల భయంతో బాధపడుతున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. తల్లిదండ్రుల ఒత్తిడి కారణంగా విద్యార్థులు నలిగిపోవడం వల్లనే ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ సమస్యతో బాధపడుతున్న వారిలో ఎక్కువ మంది విద్యార్థులు డిప్రెషన్‌లోకి జారుతున్నారు. ఇది అత్యంత ప్రమాదకర సంకేతం. ఇందులో చాలామంది ఆత్మహత్యకు కూడా ప్రయత్నిస్తూ ఉంటారు. ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడం అవసరం. విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి పనికిరాదు. ఈ విషయంలో తల్లిదండ్రులు ఆలోచన చేయాలి.

- ప్రొఫెసర్ డాక్టర్ వంశీక్రిష్ణ, మానసిక వైద్యనిపుణుల ఆసుపత్రి, కడప

జిల్లా కేంద్రంలోనే శిక్షణ ఇవ్వాలి

డీఈవోకు ఉపాధ్యాయ సంఘాల వినతి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులకు అందించే లీడర్ షిప్ ట్రైనింగ్‌ను జిల్లా కేంద్రంలోనే నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించాలని డీఈవో సుబ్రమణ్యంకు శనివారం ఉపాధ్యాయ సంఘాల నేతలు వినతిపత్రాన్ని అందించారు. ఇటీవల పశ్చిమ గోదావరిలో నిర్వహించిన శిక్షణలో ఒక ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించారని,మరొకరు ఐసీయూలో అడ్మిట్ అయ్యారని, ఆ సంఘటనలతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇకపైన జిల్లాల వారీ జరుపుతామని హామీ ఇచ్చారని వినతిలో పేర్కొన్నారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లి డివిజనల్ ప్రధానోపాధ్యాయులకు 18వ తేదీ నుంచి అనంతపురం సెంటర్‌లోనే ట్రైనింగ్‌కి హాజరుకావాలని చెబుతున్నారన్నారు. జిల్లాలోని ఏ ఒక్క పాఠశాల కూడా అనంతపురంలో జరిగే ట్రైనింగ్ సెంటర్‌కి వంద కిలోమీటర్ల లోపల లేనందువలన అన్నమయ్య జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు అందరికీ ట్రైనింగ్‌ను అన్నమయ్య జిల్లాలోనే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణ, మడితాటి నరసింహారెడ్డి, జే.వెంకట్రామిరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, రామకృష్ణ, ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు అబ్బవరం హరిబాబు, అపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ఉపాధ్యాయులు కులశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలంలోనే రైతుకు గుండెపోటు



మృతి చెందిన రైతు నరసింహులు

మదనపల్లె అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పొలానికి ఎరువు బస్తా తీసుకెళుతుండగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. దీంతో వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించేలోపే రైతు జి.నరసింహులు(45) మృతి చెందాడు. కుటుంబసభ్యుల వివరాల మేరకు తంబళ్లపల్లె మండలం, చౌడసముద్రం గ్రామం, గోవిందువారిపల్లెకు చెందిన నరసింహులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు.

శనివారం ఉదయం వ్యవసాయం పొలం వద్ద ఎరువు మోస్తున్న సమయంలో చాతీలో నొప్పి రావడంతో అక్కడే కుప్ప కూలి పోయాడు, సమచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించేలోపే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. ఈయనకు భార్య, జయమ్మ ఉన్నారు. పిల్లలు లేరు.

వీపులో దిగబడిన కత్తి

- మదనపల్లెవాసికి జీహెచ్‌లో శస్త్రచికిత్స

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన వీరాస్వామి (44) అనే కార్మికుడి వీపులో 15 సెం.మీ.మేర దిగబడిన కత్తిని నగరంలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రి (జీహెచ్)లో వైద్యులు మూడు గంటలపాటు శస్త్రచికిత్స చేసి తొలగించారు. మూడు రోజుల క్రితం బంధువులతో జరిగిన ఘర్షణల్లో వీరాస్వామి కత్తిపోటుకు గురయ్యారు. వీపులో 15 సెం.మీ. లోతులో కత్తి దిగబడటంతో అక్కడి ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు ప్రయత్నించారు. ఎక్కడా అతడికి శస్త్రచికిత్స చేసి కత్తిని తొలగించేందుకు వైద్యులు సాహసించలేకపోయారు. చివరకు చెన్నై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీహెచ్)లో చికిత్స కోసం చేరాడు. వైద్యులు అన్ని పరీక్షలు చేసి మూడు గంటల పాటు శస్త్రచికిత్స జరిపి ఆ కత్తిని తొలగించారు. శనివారం ఈ విషయమై ఆ ఆస్పత్రి డీన్ థెరని రాజన్ మాట్లాడుతూ వీరాస్వామి వీపులో కత్తి దిగబడటం వల్ల అతడిని పడుకోబెట్టి ఆపరేషన్ చేయలేక కూర్చోబెట్టి అనస్థీషియా ఇచ్చి ఆపరేషన్ చేశామన్నారు. డాక్టర్ మారియప్పన్ నాయకత్వంలో ప్రొఫెసర్ డాక్టర్ శివన్‌రాజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జయప్రకాష్‌తో కూడిన వైద్య బృందం ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిందని, ప్రస్తుతం అతడు పూర్తిగా కోలుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడని ఆయన వివరించారు.

25 నుంచి 108 సిబ్బంది సమ్మె

అధికారులకు సమ్మె నోటీసు అందచేసిన 108 సిబ్బంది



ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న 108 సిబ్బంది

కలికిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఈనెల 25 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు 108 అంబులెన్సు సర్వీసుల సిబ్బంది సమ్మె నోటీసులు అందజేశారు. శనివారం స్థానిక ఎంపీడీవో, తహసీల్దారు, పోలీసుస్టేషన్లలో సమ్మె నోటీసులను అందజేశారు. 108 సర్వీసుల అంబులెన్స్ వ్యవస్థలో నిర్వహణ సంస్థలు మారినప్పుడల్లా తమకు రావలసిన గ్రాట్యుటీ, ఎర్న్‌డ్ లీవు పరిహారం, వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వకుండానే ఆ సంస్థలు వైదొలుగుతున్నాయని నోటీసులో పేర్కొన్నారు.

దీంతో తాము ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారంగా తమ ఉద్యోగాలను వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేసి 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. టీడీపీ పాలనలో 2017లో విడుదల చేసిన 49వ నెంబరు జీవో ఆధారంగా ప్రతి ఉద్యోగికీ ప్రతి నెలా రూ.4 వేల వంతున చెల్లించే వారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేసి తమకు తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. ఈ జీవోను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో చేపడుతున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు అవసరమైన అర్హతలున్న వారు లేని కారణంగా భర్తీ చేయడం లేదని వెల్లడించారు. 108 సర్వీసుల్లో పనిచేస్తూ అనుభవం గడించిన ఈఎంటీలకు విద్యార్హతలను సడలించి నియామకాలు చేపట్టాలని కోరారు. 108 సర్వీసులు నిర్వహిస్తున్న సంస్థలు ప్రతి నెలా జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తున్న కారణంగా తాము కుటుంబాలతో మనుగడ సాగించలేకపోతున్నామని తెలిపారు. ప్రతి నెలా 5వ తేదీలోగా జీతాలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకుని అమలు చేయాలని కోరారు. వైద్య సర్వీసులకు సంబంధించి ఎక్కడా లేని విధంగా 108 సర్వీసుల్లో రోజుకు రెండు షిఫ్టుల వంతున షిఫ్టుకు 12 గంటల చొప్పున ఏకబిగిన పనిచేయిస్తూ తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. అలా కాకుండా వైద్య శాఖలోని అన్ని విభాగాల్లో అమలవుతున్న విధంగానే 108 సర్వీసు సిబ్బందికి కూడా రోజుకు మూడు షిఫ్టుల వంతున షిఫ్టుకు 8 గంటలతో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమ్మె నోటీసును అందజేసిన వారిలో కలికిరి 108 సర్వీసు సిబ్బంది ఈఎంటీలు చంద్రబాబు, యల్లమ్మ, పైలెట్‌లు వేణు, వెంకటస్వామి, ఎస్.వి. రమణలున్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు రెడ్డివారిపల్లి విద్యార్థి

నిమ్మనపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు నిమ్మనపల్లి మండలం రెడ్డివారిపల్లి జడ్పీ హైస్కూల్‌లో 8వతరగతి చదువుతున్న విద్యార్థి పి.రాజు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ త్వరలో వారణాశిలో జరగబోయే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల పీఈటీ గీతశ్రీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి



పోలీసుల సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడపరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణంలోని జిల్లా ప్రధాన జడ్జి ఛాంబరులో శనివారం పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాలత్ ప్రయోజనాలు కక్షిదారులకు వివరించి వారి కేసులు రాజీ మార్గంలో పరిష్కరించుకునేలా పోలీసు అధికారులు చూడాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఒకసారి కేసు పరిష్కారమైతే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని, అప్పీలు కూడా వెళ్లడానికి వీలు పడదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్, పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యం

- డీఎంహెచ్ఓ నాగరాజు

కడప కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమాన్ని డీఎం అండ్‌హెచ్ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో 0-5 ఏళ్ల చిన్నారులతో పాటు 6-15 ఏళ్లలోపు బాల బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. వాటి వివరాలను ఆరోగ్య ప్రగతి రికార్డుల్లో నమోదు చేసి వైద్య చికిత్సలు అందజేస్తామని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉంటే సీహెచ్‌సీ, డీహెచ్‌ఏహెచ్, రిమ్స్ ఆసుపత్రులకు రెఫర్ చేయాలని వైద్యులను ఆదేశించారు. ప్రతి గురు, శనివారం రోజుల్లో బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ ప్రక్రియ 6 నెలల పాటు జరుగుతోందన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, చర్మవ్యాధులు, చెవి, దంత సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం లైబ్రరీ వారోత్సవాల సందర్భంగా లైబ్రరీ రూమును డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసరు డాక్టర్ రమేష్, మెడికల్ ఆఫీసరు డాక్టర్ అనూష, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం మేనేజరు నవీన్, హెల్త్ ఎడ్యుకేటర్ కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అంతేనా..!

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- పరిహారం కింద వచ్చిన రూ.70 లక్షలు వృథా
- ప్రైవేటు నిర్మాణాలతో అన్యాక్రాంతం
- పట్టించుకోని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారులు



జాతీయ రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం

రాయచోటిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మాసాపేటకు సమీపంలో గల వ్యవసాయ మార్కెట్‌యార్డు దిక్కూ మొక్కూ లేకుండా అధ్వానంగా తయారైంది. ప్రహరీ గోడ లేకపోవడంతో అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా తయారైంది. దీనికి తోడు మార్కెట్‌యార్డు ఆవరణలో ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టడంతో స్థలం అన్యాక్రాంతమవుతోంది. ఇక్కడ ప్రతి బుధవారం పశువుల సంతతో పాటు ఇతర వ్యాపారులు వచ్చి వారి పంటలను విక్రయించుకుంటారు. కాగా యార్డు ఆవరణంలో నిర్మించిన బియ్యం గోడౌన్‌లో ప్రస్తుతం ఈవీఎంలను భద్రపరిచారు. ప్రహరీగోడ లేకపోవడంతో వీటి భద్రతపైనా అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. వీటిపై మార్కెటింగ్ శాఖ అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి.

వ్యవసాయ ఉత్పత్తులకు నోచుకోని యార్డు

పేరుకే వ్యవసాయ మార్కెట్ యార్డు అయినప్పటికీ ఎటువంటి వ్యవసాయ ఉత్పత్తులకు యార్డు నోచుకోవడం లేదు. జిల్లా కేంద్రమైన రాయచోటి చుట్టుపక్కల వ్యవసాయ ఉత్పత్తులైన వేరుశనగతో పాటు పండ్ల తోటల్లో ప్రధానంగా మామిడి, టమోటా తదితర పంటలను రైతులు అధికంగా సాగు చేస్తారు. అయితే ఈ వ్యవసాయ పంటలు ఏవీ కూడా మార్కెట్‌యార్డులో నిల్వ చేసి విక్రయించిన దాఖలాలు లేవు. వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ యార్డుకు వస్తే ఆదాయం ఆశించిన స్థాయిలో ఉండేది. ఆ దిశగా వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు కూడా చర్యలు చేపట్టకపోవడంతో చాలా మంది రైతులు పంటలను నిల్వ చేసుకునేందుకు అవకాశం లేక దళారుల ద్వారా వ్యాపారులకు విక్రయించి ఇంటి దారి పడుతున్నారు. ఈ ప్రాంతంలో మామిడి పంట అధికంగా ఉన్నప్పటికీ సీజన్‌లో చాలా మంది రైతులు పట్టణ నడిబొడ్డులోని ఠాణా సమీపంలో ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన మామిడికాయల మండీలకు వెళ్లి అక్కడ దళారులు, వ్యాపారులు నిర్ణయించిన ధరలకే పంటలను విక్రయించే పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తోడు దక్షిణకాశీగా పిలవబడే భద్రకాళీ సమేత వీరభద్రాలయానికి సమీపంలో గల కూరగాయల మార్కెట్‌ను పట్టణంలోని కొత్తపేట దిబ్బలబడికి సమీపంలో నూతనంగా నిర్మించిన రైతు బజారులోకి మార్చాలని రూ.ఒక కోటి ఖర్చుతో రైతు బజారు నిర్మించినప్పటికీ అక్కడికి వ్యాపారులు రాకపోవడంతో ఆ రైతుబజార్ నేడు నిరుపయోగంగా మారింది.

ప్రహరీ గోడ నిర్మాణం ఎప్పుడో...?

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సుమారు ఐదు సంవత్సరాల క్రితం తొలగించిన వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రహరీగోడ నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అప్పట్లో జాతీయ రహదారి విస్తరణలో తొలగించిన ప్రహరీగోడ స్థానంలో నూతన ప్రహరీ గోడ నిర్మాణం కోసం ఎన్‌హెచ్ అధికారులు సుమారు రూ.70 లక్షలకు పైగా పరిహారాన్ని చెల్లించారు. ఆ డబ్బుతో ప్రహరీగోడను నిర్మించి బయట వ్యక్తులను యార్డులోకి ప్రవేశించకుండా చూడాల్సిన వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు ఆ విధంగా శ్రద్ధ చూపలేదనే విమర్శలున్నాయి. ప్రహరీ గోడ లేని కారణంగా ప్రస్తుతం బయట వ్యక్తులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా యార్డులోకి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. మార్కెట్‌యార్డు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడితే అటు వ్యాపారులతో పాటు ఇటు రాయచోటి ప్రాంతంలోని రైతన్నలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

టెండర్లు పిలుస్తున్నా రావడం లేదు

- మదన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్‌యార్డు సెక్రటరీ, రాయచోటి

నూతన ప్రహరీ గోడ ఏర్పాటు కోసం 2021 సంవత్సరం నుంచి టెండర్లు పిలు స్తున్నా కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. ప్రహరీగోడ నిర్మాణంతో పాటు జాతీయ రహదారి నుంచి బియ్యం గోడౌన్, మార్కెట్ యార్డు కార్యాలయం వరకు సిమెంటు రోడ్డు ఏర్పాటు కోసం రూ.65 లక్షలతో పలుమార్లు టెండర్లు పిలిచాము. 20 ఎకరాలకు పైగా ఉన్న మార్కెట్ యార్డులో గతంలో సర్వే చేయించి కంపచెట్లను, పిచ్చిమొక్కలను తొలగించాం. స్థలం ఎక్కడా అన్యాక్రాంతానికి గురికాలేదు. ప్రహరీగోడ నిర్మాణానికి, సిమెంటు రోడ్డు ఏర్పాటుకు వ్యవసాయ మార్కెట్‌యార్డు ఖాతాలో నిధులు ఉన్నాయి. ఎవరైనా టెండర్లు వేస్తే నిర్మాణాలను పూర్తి చేస్తాం.



మార్కెట్‌యార్డు స్థలంలో ప్రైవేటు వ్యక్తులు చేపట్టిన నిర్మాణాలు



యార్డులో నిరుపయోగంగా ఉన్న శీతల గిడ్డంగులు

వైసీపీ నాయకుల భూకబ్జాపై విచారణ జరిపిస్తాం

- 200 ఎకరాలు కబ్జా చేసిన వైఎస్ కుటుంబం
- ఫారెస్టు భూమి ఆక్రమించిన ఎంపీ అవినాశ్ పీఏ
- తొండూరులో వందల ఎకరాల ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్
- సెంటు కబ్జా చేసినట్లు చూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తా
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి

పులివెందులటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల భూకబ్జాలపై విచారణ జరిపిస్తామని, వైఎస్ కుటుంబ సభ్యులు 200 ఎకరాలు భూకబ్జా చేశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి.. టీడీపీ నేతలు భూకబ్జాలు చేశారంటూ ఆర్డీవోకు ఫిర్యాదు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఒకరిపై ఆరోపణలు చేసే ముందు గతంలో 'మనం ఎటువంటి పరిపాలన అందించాం, మా నాయకులు ఎంత మంది భూములు ఆక్రమించారని' ఎంపీ గుర్తుపెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. గత ప్రభుత్వంలో వైఎస్ కుటుంబమే దాదాపు 200 ఎకరాలు భూకబ్జాలకు పాల్పడిందని తెలిపారు. మీ కుటుంబ సభ్యులు తొండూరు మండలంలో దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసి భూకబ్జాలకు పాల్పడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ విషయంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎంపీ పీఏ రాఘవరెడ్డి ఎప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంటాడని, అటువంటి వ్యక్తి ఇంటికి అర్ధరాత్రి పోలీసులు వెళ్లి ఇబ్బంది పెట్టారని చెప్పిన అదే రాఘవరెడ్డి అంబకపల్లి గ్రామంలో ఫారెస్టు భూమిని కబ్జా చేసి సాగు చేస్తున్నాడని తెలిపారు. వైసీపీ నాయకుడు దేవిరెడ్డి శంకర్‌రెడ్డి దొండ్లవాగు గ్రామంలో దేవిరెడ్డి చైతన్యరెడ్డి పేరుతో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఆరోపించారు. ఇకపోతే మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కదిరి రోడ్డులో 15 ఎకరాల డీకేటీ భూమిని ఇప్పటికీ ఆక్రమించుకుని ఉన్నారని తెలిపారు. వీటిని నిరూపించడానికి సిద్ధమా, ఆ భూములు మీవి కావని ఒక మాట చెప్పండి ఇప్పుడే పేదలకు పంచుతామన్నారు. ఇంత దారుణంగా భూకబ్జాలు చేసి ఏమీ ఎరగనట్లు ఎంపీ టీడీపీ నాయకులపై ఫిర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇంతవరకు ప్రభుత్వ భూమి తాను ఆక్రమించినట్లు వైసీపీ నాయకులు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. వైసీపీ నాయకులు ప్రజల భూములను కబ్జా చేసి ఉంటే ఆర్డీవోకుకానీ, డీఎస్పీకి కానీ ఫిర్యాదు చేయాలని తప్పకుండా వారికి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన అన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు గురించి వైసీపీ నాయకులు మాట్లాడడం అర్థరహితమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, వేంపల్లె మండల నాయకులు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై నరమేధం ఆపాలి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై నరమేధం ఆపాలని, యుద్ధాన్ని వెంటనే విరమించుకోవాలని వీక్షణం పత్రికా ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ కోరారు. శనివారం జిల్లా పరిషత్ జడ్పీ సమావేశ మందిరంలో కడప సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో డాక్టర్ వెంగల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పాలస్తీనా గాజా ప్రాంతంలో నరమేధం జరుగుతుందని, ఇప్పటి వరకు 43 వేల మంది చంపబడ్డారని, లక్షల మందికి గాయాలయ్యాయన్నారు. అందులో 17 వేల మంది పసిపిల్లలే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల ఇళ్లు నేలకూలడంతో వేల కోట్ల రూపాయలు ఆస్తినష్టం జరిగిందన్నారు. చరిత్రలో ఎప్పటి నుంచో పాలస్తీనా దేశం ఉందని, అమెరికా బ్రిటన్‌లు చమురు బావుల కోసమే ఇజ్రాయిల్‌ను పాలస్తీనా ప్రజలకు పక్కలో బల్లెంలా వాడుకుంటున్నారన్నారు. ఇదొక రాజకీయ ఆర్థిక యుద్ధమన్నారు. సీపీఎం జిల్లా నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై చేస్తున్న యుద్ధాన్ని ప్రపంచ శాంతి కాముకులందరూ ఖండిస్తున్నారన్నారు. సీపీఐ నాయకుడు చంద్ర మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు పాలస్తీనాకు మద్దతిస్తున్నాయని, యుద్ధం మాత్రం ఆగలేదన్నారు. సమావేశం అనంతరం కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద పాలస్తీనాలో మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, బాబుబాయ్, సుల్తాన్, మైనుద్దీన్, గురప్ప, వరలక్ష్మి, డాక్టర్ వినోదిని, సునీత, కుమారస్వామి, రఘునాథరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సీపీయం నాయకులు పాల్గొన్నారు.

కడపలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల భారీ ర్యాలీ



సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ 20వ జిల్లా మహాసభల సందర్భంగా శనివారం కడప నగరంలోని పలు కూడళ్ల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడారు. పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానం వల్ల పేదలకు విద్య అందని ద్రాక్షలా తయారవుతోందన్నారు. ఇప్పటికే రేషనలైజేషన్ పేరుతో దేశవ్యాప్తంగా 60 వేల ప్రభుత్వ పాఠశాలలను హైస్కూల్లో విలీనం చేశారని, దీనివల్ల లక్షలాది మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. సుమారుగా 70 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు జీవో నెం.77 వల్ల ఉన్నత పీజీ విద్యకు దూరమవుతున్నారని, సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌కు సొంతభవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగులో ఉన్న మెస్, కాస్మెటిక్ చార్జీలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, వలరాజు, న్యాయసభ జిల్లా సహాయ కార్యదర్శి లీలాక్రిష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రతేజ, పీటర్, వెంకటరెడ్డి, మాజీ విద్యార్థి నాయకులు మద్దిలేటి, చంద్రశేకర్ పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు

- పోలీసుస్టేషన్‌లో యువతి ఫిర్యాదు

పులివెందులటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివాహం చేసుకుంటానని చెప్పి శారీరక సంబంధం పెట్టుకుని, ఆ తరువాత పెళ్లి చేసుకోకుండా మోసం చేశాడని పులివెందుల పట్టణానికి చెందిన ఓ యువతి పులివెందుల అర్బన్ పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద చికెన్ షాపు పెట్టుకుని ఉంటున్న సిరిగేపల్లె మల్లికార్జున కుమారుడు యశ్వంత్ తనను ప్రేమిస్తున్నానని గత మూడేళ్లుగా వెంట పడుతున్నాడని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి శారీరకంగా వాడుకున్నట్లు ఆరోపించారు. ఇప్పుడు పెళ్లి చేసుకోమంటే 'మాదిగ కులానికి చెందిన నిన్ను ఎలా పెళ్లి చేసుకుంటాను' అని దుర్భాషలాడుతున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు క్రైం నెం.413/2024 కేసులో 69 బీఎంఎస్, ఎస్సీ ఎస్టీ కేసులు సంబంధించి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- అదుపులో ముగ్గురు స్మగ్లర్లు



పట్టుబడ్డ దుంగలతో పాటు స్మగ్లర్లు

గోపవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బద్వేలు-నెల్లూరు ప్రధాన రహదారిలో అటవీ లోతట్టు ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేయగా రూ.77 వేలు విలువ చేసే పది ఎర్రచందనం దుంగలతో పాటు ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామని బద్వేలు ఎఫ్ఆర్ఓ నయీం ఆలీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ డీఎఫ్‌వో వినీత్‌కుమార్, ఐఎఫ్ఎస్ సబ్ డీఎఫ్‌వో స్వామివివేకానంద ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిర్వహణలో భాగంగా కడప-నెల్లూరు జిల్లా సరిహద్దు ప్రాంతమైన లారీ బాటకు వెళ్లే ప్రదేశంలో అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు దాడులు చేయగా ముగ్గురు స్మగ్లర్లతో పాటు పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఒక మోటరు బైకును సీజ్ చేశామన్నారు. పట్టుబడిన వారు నెల్లూరు జిల్లాకు చెందిన నామాల వెంకటేశ్వర్లు, షేక్ ఖాజారసూల్, కంభంపాటి సూర్యనారాయణగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో బీవైఆర్‌వో శేషయ్య, ఎఫ్‌హెచ్‌వో ఖాజవలి, ఎఫ్‌డీవో సువర్ణకుమార్, ఎఫ్‌బీవో రాజేశ్‌రెడ్డి, పుష్పరాజ్ పాల్గొన్నారు.

లభ్యం కాని యువకుడి ఆచూకీ



మృతదేహం కోసం గాలిస్తున్న ఫైర్ సిబ్బంది, స్థానిక ఈతగాళ్లు

వల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరి పెన్నానదిలో శుక్రవారం గల్లంతైన యువకుడి ఆచూకీ శనివారం రాత్రి వరకు లభించలేదు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగిరికి వచ్చిన కడప పట్టణంలోని ఎన్జీవో కాలనీకి చెందిన రెడ్డిపల్లె గణేశ్ నీటిలో మునుగుతున్న బాలుడిని రక్షించబోయి గల్లంతైన విషయం తెలిసిందే. పోలీసులు, బంధువులు శనివారం ఉదయం నుంచి ట్యూబుల సహాయంతో జాలర్ల ద్వారా, గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటన జరిగిన ప్రదేశం నుంచి నది వెంబడి చెన్నూరు మండల పరిధిలోని కనపర్తి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు.

విద్యుత్తు షాక్‌తో బాలుడి మృతి

సీకెదిన్నె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు షాక్‌కు గురై దుద్యాల వరమోక్షిత్ (8) శనివారం మృతిచెందినట్లు సీకేదిన్నె పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. ప్రొద్దుటూరు కుమ్మరకొట్టాలు గ్రామానికి చెందిన దుద్యాల వరుణ్‌కుమార్, కడపలోని ఓ ప్రైవేటు స్కూల్ హాస్టల్ విద్యార్థుల బట్టలు ఉతికే కాంట్రాక్టు తీసుకున్నాడు. రెండు రోజుల క్రితమే స్కూల్ బయట రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నాడు. అయితే అతని కుమారుడు వరమోక్షిత్ ప్రొద్దుటూరు ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతూ శనివారం తండ్రి వద్దకు వచ్చాడు. ఈ నేపథ్యంలో స్నానం చేసేందుకు బకెట్‌లో ఉంచిన వాటర్‌హీటర్‌ను ప్రమాదవశాత్తు తగిలి స్పృహ కోల్పోయాడు. బాలున్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



పుల్లంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట రైల్వేగేట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని కల్లూరి వెంకటరమణ అలియాస్ చిరంజీవి మృతి చెందినట్లు పుల్లంపేట ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి వేళ రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటు ఎప్పుడు?

● పరిశ్రమలకు అవకాశం ఉన్నా వెంటాడుతున్న విద్యుత్ లేమి ● నేటికీ సింగిల్ ఫేజ్ కరెంటే ● 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరైతేనే ప్రయోజనం




చెన్నూరులో ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్... 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం సిద్ధంగా ఉన్న స్థలం

చెన్నూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :చెన్నూరు మండలం పరిశ్రమలకు నెలవైన ప్రాంతం. ఈ విషయం గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 20 ఏళ్ల క్రితం ఆర్‌డీఎస్‌ఎస్ (ది వ్యాంప్ డిస్ట్రిబ్యూషన్ స్ట్రెంథన్ సిస్టం) ఏర్పాటుకు అనుమతించింది. ఇందుకోసం మూడున్నర ఎకరాల స్థలం కూడా కేటాయించారు. పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటైతే 132 కేవీ సబ్‌స్టేషన్‌కు వీలవుతుంది. దీంతో చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే ఈ ప్రాజెక్టు కాస్త అటకెక్కింది. ఈ ప్రాంతానికి కడప నగరంలోని 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే అక్కడి సబ్‌స్టేషన్ తగ్గు ప్రాంతంలో ఉండడంతో వర్షాకాలంలో నీరు నిల్వ చేరుతోంది. దీంతో విద్యుత్ సరఫరా నిలిపేయాల్సి రావడం, ఎక్కువగా ట్రిప్ కావడం, ఫలితంగా విద్యుత్ సమస్య ఏర్పడుతుండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాంటి పరిస్థితికి చెక్ పెట్టాలంటే 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నా ఫలితం లేదు. పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటైతే తప్ప 132 కేవీ సబ్‌స్టేషన్ సాధ్యం కాదంటున్నారు.

నిరుద్యోగ యువతకు చేయూత ఏదీ?

మండల వ్యాప్తంగా ఐటీఐ, డిప్లమా ఇంజనీరింగ్ చదివిన నిరుద్యోగులు కోకొల్లలుగా ఉన్నారు. నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉంటే వీరంతా స్థానికంగా చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి సాగిస్తారు. పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. స్థానికంగా అవకాశం ఉండి కూడా వీరంతా ఉపాధి కోసం బయట ప్రాంతాలకు వెళుతుండటం బాధాకరం.

ప్రాజెక్టు ఏర్పాటుకు అన్ని వసతులూ ఉన్నాయి



ఆర్‌డీఎస్‌ఎస్ ప్రాజెక్టు ఏర్పాటుకు చెన్నూరు మండలంలో అన్ని అవకాశాలు ఉన్నాయి. గతంలో ప్రాజెక్టు విషయాన్ని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లా. ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఆర్‌డీఎస్‌ఎస్ ఏర్పాటు అయితే ఆదాయం బాగా ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు ఎమ్మెల్యే చొరవచూపాలి.

\- రామలింగారెడ్డి, ఏఈ, ట్రాన్స్‌కో

పరిశ్రమల స్థాపనకు సిద్ధంగా ఉన్నాం



నా లాంటి నిరుద్యోగులు మండల వ్యాప్తంగా ఎంతో మంది ఉన్నారు. వారంతా ఇంజనీరింగ్, డిప్లమా, ఐటీఐ పూర్తి చేశారు. వారికి స్థానికంగా సరైన అవకాశాలు లేక కడపకు వెళ్లాల్సి వస్తోంది. పరిశ్రమ స్థాపించాలంటే విద్యుత్ సరిగా ఉండడంలేదు. 33 కేవీ సబ్‌స్టేషన్‌ను 132 కేవీ సబ్‌స్టేషన్‌గా మార్పు చేస్తే చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వీలుంటుంది.

\- నీలం హర్షవర్ధన్‌రెడ్డి, చెన్నూరు

చిత్రం చెప్పిన సమస్య



ఇది మామూలు రోడ్డు కాదు... జాతీయ రహదారి. చెన్నూరు వద్ద పెన్నానదిపై ఉన్న హైలెవెల్ వంతెనపై కాంక్రీటు లేచిపోవడంతో కడ్డీలు బయటపడ్డాయి. గతంలో ఇక్కడ రెండు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ఇద్దరు మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు. ఇప్పటికైనా హైవే అధికారులు మరమ్మతులు చేపట్టకపోతే మరిన్ని ప్రాణాలుపోయే ప్రమాదముంది.

\- చెన్నూరు, (ఆంధ్రజ్యోతి)

'వైఎస్ షర్మిలపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి'

కడప క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నేత మధురెడ్డి శనివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో షర్మిలపై తప్పుడు పోస్టులు పెడుతున్నారని, ఫోటో మార్ఫింగ్ చేస్తున్నారని, ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

డైమండ్ జూబ్లీ ఉత్సవాలను జయప్రదం చేయండి

కడప(వినాయకనగర్), నవంబరు16(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 24న జరగనున్న ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ ఉత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు కొండయ్య, జాతీయ సహాయ అధ్యక్షుడు కొండయ్య, రిమ్స్ హెచ్‌ఆర్ఎంఓ శ్రీనివాసులు, నర్సింగ్ సూపరింటెండెంట్ మాధవీలత పిలుపునిచ్చారు. కరపత్రాలను విడుదల చేశారు.

బీఎస్ఎన్ఎల్ సర్వీసులను పునరుద్ధరించాలి

చక్రాయపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట మండలంలో బీఎస్ఎన్ఎల్ సేవలులేక ప్రజలు రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్నారని, వెంటనే పునరుద్ధరించాలని బీజేపీ నాయకుడు కె.రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ విషయమై టెలికాం డీఎంకు శనివారం వినతిపత్రం అందించామన్నారు.

పొలతలలో రేపు అన్నప్రసాద వితరణ

కడప కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 18న పొలతల మల్లేశ్వర స్వామి ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రజక అన్నదాన సేవాసమితి అధ్యక్షుడు మచ్చయ్యగారి మల్లయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని రజక సంఘాల నాయకులు, దాతలు, ముఖ్య అతిథులుగా హాజరు కానుట్లు తెలిపారు. కావున భక్తులు స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించాలని ఆయన కోరారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందజేత

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి పండుగల సందర్భంగా ఎంఆర్ హోండా షోరూంలో లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందజేశారు. శనివారం ఆ సంస్థ ఎండీ ముమ్మడిరెడ్డి మహేంద్రారెడ్డి విజేతలకు బహుమతులు అందించారు. మొదటి బహుమతిగా టీసీఎల్ 55 గూగుల్ టీవీ సుధాకర్‌రెడ్డికి అందించారు. రెండో బహుమతిగా ఫ్రిజ్‌ను పులివెందులకు చెందిన ప్రశాంతికి, మూడో బహుమతిగా వాషింగ్‌మిషన్‌ను అయ్యవారిపల్లెకు చెందిన రమేష్‌కు అందజేశారు. అలాగే 20 మందికి కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మడిరెడ్డి నరేంద్రారెడ్డి, జనరల్ మేనేజర్ సందీప్‌కుమార్, సేల్స్ మేనేజర్ గోపీనాథరెడ్డి, ఏజీఎం షేక్షావలి, షోరూం సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



సుధాకర్‌రెడ్డికి ప్రథమ బహుమతిగా టీవీని అందజేస్తున్న షోరూం ఎండీ మహేంద్రారెడ్డి, జీఎం సందీప్‌కుమార్

రామాపురం పుణ్యక్షేత్రంలో కన్నులపండువగా మహా కోటి దీపోత్సవం

కమలాపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని రామాపురం పుణ్యక్షేత్రంలో వెలసిన మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత ద్వికంధర షణ్ముఖ సుబ్రమణ్యం స్వామి ఆలయంలో శనివారం మహాకోటి దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. భక్తులకు ఆలయ ప్రధాన సేవకుడు కాశీభట్ల సాయి నాథ్‌శర్మ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే సుబ్రమణ్యస్వామికి ఆలయ మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అల్పాహారం అందజేశారు.



మహా కోటి దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరుసు ఉత్సవాలు విజయవంతం చేద్దాం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాత పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేద్దాం అని టీడీపీ నేతలు హరిప్రసాద్, గోవర్ధనరెడ్డి, నజీర్ అహ్మద్ పిలుపునిచ్చారు. దర్గా పవిత్రతను దెబ్బతీసేందుకు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని వాటిని తిప్పికొట్టాలని సూచించారు. శనివారం కడప నగరం హరి టవర్స్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ పెద్దదర్గా పీఠాధిపతి, దర్గా ప్రతినిధులను ఈ జిల్లా కాని వ్యక్తులు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు. ఉరుసు ఉత్సవాలు జరగకుండా ప్రయత్నిస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో లేనిపోనివి సృష్టిస్తున్నారని ఆరోపించారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే భక్తులు అబద్ధపు మాటలు నమ్మకుండా ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ నాయకులు గన్నేపాటి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పాకా సురేశ్



కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పాకా సురేశ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. పాకా సురేశ్‌కు వైసీపీలోని పలు విభాగాల్లో పనిచేసిన అనుభవం దృష్ట్యా సంయుక్త కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రామ్మూర్తి నాయుడి మృతి బాధాకరం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడి మృతి బాధాకరమని బీసీ సంఘం నేతలు వీరయ్య, యాటగిరి రాంప్రసాద్ తెలిపారు. శనివారం తమ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

టీడీపీ సభ్యత్వ నమోదును పండుగలా చేపడదాం

కమలాపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని అందరం కలిసి ఒక పండుగలా చేపడదాం అని, ప్రతి కార్యకర్తకు సభ్యత్వం కొండంత అండ అని ఆ పార్టీ నేత జంపాల నరసింహారెడ్డి తెలిపారు. శనివారం కమలాపురం నగర పంచాయతీలోని 19వ బూత్‌లో 171 మందికి సభ్యత్వం నమోదు చేయించామన్నారు.ఆయన మాట్లాడుతూ సభ్యత్వం పొందిన వారికి ఏ కష్టం వచ్చినా తీరుస్తామన్నా రు. 13వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ రఫి, మునిశేఖర్, కదిరయ్య, ఐటీడీపీ టీం సభ్యులు పాల్గొన్నారు.



కమలాపురంలో టీడీపీ సభ్యత్వం నమోదు చేస్తున్న పార్టీ నాయకులు

చట్టాన్ని ఉల్లంఘించకూడదు

చక్రాయపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పౌరులు చట్టాన్ని ఉల్లంఘించకూడదని లక్కిరెడ్డిపల్లె మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఫైజున్నిసా అన్నారు. శనివారం కుప్పం తాండాలో లీగల్ లిటరసీ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్జి మాట్లాడుతూ పేదలు, వికలాంగులు, మతిస్థిమితం లేని వారికి ఉచిత న్యాయ సహాయం చేస్తామన్నారు. అవసరమైన వారందరూ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

సమాజ రుగ్మతలను రూపుమాపిన వేమన పద్యాలు : ఈశ్వర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యోగి వేమన పద్యాలు సమాజంలోని రుగ్మతలను రూపుమాపాయని, ఆత్మలో పరమాత్మను ప్రతిష్ఠించిన మానవీయ కవి వేమన అని ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం తమిళనాడు రాజ్‌భవన్‌లో యోగా కవులైన తిరువళ్లువార్ కబీర్ దాస్, యోగివేమనలపై జరిగిన బహు బాషల అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి హృదయంలో కొలువై ఉన్న శివున్ని చూడడం చేతకాక జనం విగ్రహాల వైపు పరుగులు తీయడాన్ని వేమన ఖండించిన విధానం శాస్త్రీయ జ్ఞానానికి సంబంధించిన అంశంగా పేర్కొన్నారు. అనంతరం ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డిని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, రాజస్తాన్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసరు లక్ష్మి అయ్యర్, ప్రముఖ ద్విబాషా కవి రవి తదితరులు సత్కరించారు.



యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో గౌరీదేవి నిమజ్జనం

వేంపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సంగం వీధిలో వెలసిన మంగళగౌరీదేవి నిమజ్జన కార్యక్రమాన్ని వృషభాచలేశ్వరస్వామి పుష్కరిణిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌరీదేవికి శనివారం ఊరేగింపు నిర్వహించారు.ఆలయ పూజారులు ప్రసాదరావు, సత్యనారాయణ ఆధ్వర్యంలో పుష్కరిణిలో అమ్మవారి పసుపుముద్ద తొట్టిని నిమజ్జనం చేశారు. బలిజ సంఘం అధ్యక్షుడు కటిక చంద్రశేఖర్, నంబూరు కుళాయప్ప, మహిళా మండలి ప్రతినిధులు, తమలపాకు తోట సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



వృషభాచలేశ్వర స్వామి పుష్కరిణిలో గౌరీదేవి నిమజ్జనం నిర్వహిస్తున్న భక్తులు

సైబర్ మోసాల పట్ల అప్రమత్తత అవసరం

సింహాద్రిపురం, నవంబరు 16: సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సింహాద్రిపురం బ్రాంచి మేనేజరు కృష్ణ కిషోర్, ఫీల్డ్ ఆఫీసర్ మధుసూదన్ విద్యార్థులకు సూచించారు. శనివారం సింహాద్రిపురం కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వేంపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చర్మవ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సేవా సమితి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కడపరోడ్డులో ఉన్న షిర్డిసాయి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ చర్మవ్యాధుల నిపుణుడు డాక్టర్ ఉదయ్‌కిరణ్ రాజా పరీక్షలు చేస్తారన్నారు. మందులు కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు.

సంక్షిప్తం

మెస్ చార్జీలు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెండింగులో ఉన్న మెస్, కాస్మటిక్ చార్జీలను విడుదల చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం పీఎస్‌యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు పూర్తికావస్తున్నా చార్జీలు అందలేదని, తక్షణమే విడుదల చేయాలని కోరారు.

'ఈడబ్ల్యూసీని ప్రభుత్వం ఆమోదించాలి'

కడప మారుతీనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎకనామికల్ బ్యాక్వర్డ్ క్లాస్ (ఈడబ్ల్యూసీ)ని ప్రభుత్వం ఆమోదించాలని కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ స్వామి కోరారు. శనివారం స్థానిక కాపునాడు రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సంబంధిత జీఓను పునరుద్ధరించాలని కోరారు. కడప నగరంలో బలిజ భవన్‌ను నిర్మించాలన్నారు. గ్రేటర్ రాయలసీమ కాపు సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో 230వ ర్యాంకు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ జాతీయ స్థాయి పరీక్షల్లో కడప నగరం శంకరాపురానికి చెందిన విద్యార్థి విజయక్రిష్ణకు 230వ ర్యాంకు లభించింది. ఈయన కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ చేసే సమయంలో కూడా గోల్డ్‌మెడల్ సాధించారు. జాతీయ స్థాయి ర్యాంకు రావడం పట్ల ఆయన తల్లిదండ్రులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

యూనిఫాం పంపిణీ

కడప(వినాయకనగర్),నవంబరు16(ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని రామరాజుపల్లెలో శిక్షణ పొందిన కోలాటం బృందానికి సీఆర్‌ఐ సుబ్బారెడ్డి తనయుడు దినేశ్ శనివారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మునెయ్య, వెంకట్రమణ, చంద్రగుప్త, నాగార్జున, హేమంత్, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు మండల మీట్

సీకేదిన్నె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ కుళాయిబాబు తెలిపారు. ఈ సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తామని, అన్ని శాఖల అధికారులు పాల్గొని మండల అభివృద్ధిపై చర్చిస్తారన్నారు.

నేడు అయ్యప్పస్వామి గ్రామోత్సవం

పెండ్లిమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరధిలోని మమ్మిసిద్దుపల్లెలో ఆదివారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివార బ్రహ్మోత్సవం, మొదటిసారి మాలధరించిన స్వాములకు కలశపూజ ఉంటుందన్నారు.

'26న జిల్లా వ్యాప్త నిరసనలు'

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతాంగం వ్యతిరేక విధానాలపై ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా నాయకులు తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మనోహర్, నాగసుబ్బారెడ్డి, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు మాట్లాడారు.

కొత్త చెరువుకు నీరు విడుదల

లింగాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): లింగాల పాత చెరువునుంచి కొత్త చెరువుకు ఎత్తిపోతల ద్వారా లింగాల తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం నీటిని విడుదల చేశారు. పదిరోజుల క్రితం టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి పాత చెరువుకు లింగాల కుడికాల్వ నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేశారు. పాత చెరువుకు సగం మేర నీరు రావడంతో అక్కడ నుంచి కొత్త చెరువుకు నీటిని విడుదల చేశారు.

గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

వేముల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. దాదాపు 30 మంది విద్యార్థినీ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు లైబ్రేరియన్ గంగాధర్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, లీడర్స్ లక్ష్మినారాయణరెడ్డి, శ్రీనివాసులు, సూర్యుడు, మహమ్మద్ వలి తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్యాప్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి 18వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌బాబు ఓ ప్రకటనలోతెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే జాబ్‌మేళాకు షిర్డిసాయి ఎలక్ట్రికల్, అమరరాజా గ్రూప్, ఏఐఎల్ డిక్సన్, నవభారత ఫర్టిలైజర్స్, యంగ్ ఇండియా వంటి కంపెనీలు పాల్గొంటాయని ప్రొద్దుటూరు, కడప, ఇతర జిల్లాల్లో పనిచేయడానికి ఎంపికలు నిర్వహిస్తామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్ చదివిన అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాలలోపు వారు జాబ్‌మేళాలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల మాటున దళారుల దందా..!

• లోపలో మార్కెట్.. బయటో మార్కెట్ • పోరుమామిళ్ల రోడ్డులో సాయంత్రం అయిందంటే రద్దీ • పట్టించుకోని అధికారులు

బద్వేలు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ,మున్సిపాలిటీ, నగర కార్పొరేషన్ అయినా వారి వారి ఆధ్వర్యాల్లో ఓ ప్రాంతంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తారు. కూరగాయల మార్కెట్‌కు వేలం పాట నిర్వహించి అందులో వచ్చిన సొమ్మును సదరు కాంట్రాక్టు వద్ద నుంచి తీసుకుని ఆ వ్యక్తి మార్కెట్లో రుసుం వసూలు చేస్తుంటారు. ఇది ఎక్కడైనా జరిగే ఓ పద్ధతి. కానీ బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో మాత్రం ఆ పద్ధతి కొనసాగడంలేదు. మున్సిపల్ మార్కెట్ ఉన్నప్పటికీ మార్కెట్ బయటనే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన దళారీలు మరో మార్కెట్ ఏర్పాటు చేసుకుని సాయంత్రం వేళల్లో క్రయ విక్రయాలు కొనసాగిస్తుండడంతో పోరుమామిళ్ల రోడ్డు బాయిస్ హైస్కూలు సమీపంలో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. అయితే సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో బయటో మార్కెట్, లోపలో మార్కెట్ అన్న చందంగా బద్వేలు పట్టణంలో నడుస్తున్నాయి.

సంవత్సరానికి వేలంపాట..: కూరగాయల మార్కెట్‌కు సంబంధించి ఏడాదికొకసారి మున్సిపాలిటీ వేలం పాట నిర్వహిస్తుంది. వేలం పాటలో కూరగాయల మార్కెట్ దక్కించుకున్న కాంట్రాక్టరు కూరగాయల మార్కెట్లో రుసుం వసూలు చేస్తూ వచ్చిన మొత్తం మున్సిపాలిటీకి కట్టాలి. అయితే ప్రస్తుతం బయట కూడా కూరగాయల మార్కెట్ నడుస్తుండడంతో ఆ కాంట్రాక్టరు రుసుం వసూలు తక్కువై ఏడాదికోసారి మున్సిపాలిటీకి వేలం పాట సొమ్ము ఎలా చెల్లించాలని ఆవేదన చెందుతున్నారు.

కూరగాయల మార్కెట్ ఉన్నా మరో మార్కెట్ ఎలా..?:
మున్సిపాలిటీ కూరగాయల మార్కెట్ ఉన్నప్పటికీ



పోరుమామిళ్ల రోడ్డులో కూరగాయల మార్కెట్ వద్ద ట్రాఫిక్

రైతు బజారు లేకపోవడంతో చుట్టూ గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు తాము తెచ్చిన కూరగాయలను మార్కెట్ బయటపెట్టి విక్రయించేవారు. ఇదే అదనుగా భావించిన కొందరు దళారులు రైతులు వద్ద నుంచి కూరగాయలు కొనుగోలు చేసి అక్కడే దుకాణం ఏర్పాటు చేసుకుని క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. తక్కువ ధరతో దళారీలు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి మార్కెట్ రేటుకే బయట విక్రయిస్తుండడంతో కొనుగోలు దారులు రెండు మార్కెట్లు ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

అధికారుల చర్యలేవీ...?: పోరుమామిళ్ల రోడ్డు బాయిస్ హైస్కూలు సమీపంలో సాయంత్రం అయ్యేసరికి రైతులు,దళారీలు కూరగాయలమార్కెట్ నడుపుతుండడంతో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సాయం త్రం 4 నుంచి రాత్రి 8.30వరకు ఈ తంతు కొనసాగుతూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

త్వరలోనే చర్యలు తీసుకుంటాం

కూరగాయల మార్కెట్ బయటదళారీలు మార్కెట్ నడపవద్దంటూ రెండు, మూడు దఫాలు తొలగించాం. అర్బన్ సీఐతో కలిపి సమావేశం ఏర్పాటు చేసి కూడా హెచ్చరించాం. అయినప్పటికీ తిరిగి రైతులు కాకుండా దళారీలు కూరగాయల మార్కెట్ నడుపుతున్నారు. పోలీసులతో కలిసి వీరిపై త్వరలోనే చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూస్తాం.

• వాకమల్ల నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్, బద్వేలు

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసం మూడో శనివారం సందర్భంగా వేకువజామున ప్రత్యేక అభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ నేడు కోటిదీపోత్సవ కార్యక్రమం ఉంటుందని 365 వత్తులు, కావలసిన సామగ్రిని ఆలయ నిర్వాహకులు ఉచితంగా అందిస్తామన్నారు. స్వామివారి పూజా కార్యక్రమం, దీపోత్సవంలో పాల్గొనదలచిన వారు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరంలేదన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా సాయంత్రం 5గంటలకు ఆలయం వద్దకు చేరుకోవాలని తెలిపారు. మధ్యాహ్నం మండల పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన గుండ్లపల్లె నరసరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

• ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి • బీసీ సంఘం డిమాండ్

జమ్మలమడుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని అదే దిశగా రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ప్రొద్దుటూరు బీసీ సంఘం అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం జమ్మలమడుగులోని నాగులకట్ట చౌడేశ్వరీదేవాలయం వద్ద జమ్మలమడుగు నియోజకవర్గ బీసీ సంఘం నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. బీసీలను ఆయా ప్రభుత్వాలు ఓట్లకుమాత్రమే వాడుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో బీసీల పరిస్థితి దారుణంగా మారిందని, అగ్రవర్ణాలవారు రాజకీయంగా అణగదొక్కుతూ ముందుకు రానివ్వడంలేదని అన్నారు. బీసీలంతా ఐకమత్యంతో ఒక్కటై అభివృద్ధికోసం ముందుకు రావాలని సూచించారు. జమ్మలమడుగు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బీసీ నాయకుడు సర్పంచ్ కొండయ్య మాట్లాడుతూ బీసీలంతా ఐకమత్యంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం జమ్మలమడుగులో త్వరలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని అన్నారు. చేనేత ఐక్యవేదిక, జాతీయ ఉపాధ్యక్షుడు కాటా రామదాసు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం బీసీలకు, చేనేత కార్మికులకు ఉచింతంగా కరెంటు అందిస్తామని ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నప్ప,బీసీ సంఘం కోశాధికారి మడక సంటెయ్య, కార్యవర్గ సభ్యులు తుపాకుల చౌడయ్య, చేనేత జాతీయ కన్వీనర్ గొరిగెకొండప్ప, రజకసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నప్ప, బీసీ సంఘం సెక్రటరి బత్తల శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంఘం అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు

డీఎస్పీకి ఏపీఎమ్మార్పీఎస్ వినతి

జమ్మలమడుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఇటీవల కొత్తగా బాధ్యతలు తీసుకున్న డీఎస్పీ వెంకటేశ్వరరావును శనివారం జిల్లా ఏపీఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలయ్య పలు మండలాల అధ్యక్షులు కలిశారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, ఓబులేసు, తదితర నాయకులు పాల్గొన్నారు.

బీసీ భవన నిర్మాణానికి కృషి చేయాలి

బద్వేలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బద్వేలులో బీసీ భవన నిర్మాణానికి బీసీ లందరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి పేర్కొన్నారు. శనివారం బీసీ భవన సాధన కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు పట్టణంలో చిన్న చిన్న శుభ కార్యాలు ఏర్పాటు చేసుకునేందుకు అనువైన ఎకరా ప్రభుత్వ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామసుబ్బయ్య యాదవ్, రంగయ్య, యం. శ్రీనివాసులు, నాగార్జున, బోలా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమకు ఎమ్మెల్యేలు ఒత్తిడి తేవాలి

బద్వేలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల చిరకాల కోరిక అయిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు జిల్లా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తేవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని పేర్కొన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షరీఫ్, మస్తాన్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. శనివారం నందమూరి యువసేవా సమితి ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్‌లో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేధికం సుందర్శన్ ,నాయకులు వెంకటసుబ్బయ్య, టప్పా మహబూబ్‌బాష, రామూనాయుడు, సుబ్బరాజు, సమర, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధిపై శిక్షణ

బి.కోడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులకు ఎంపీడీవో భాస్కర్‌రావు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాబోవు ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, కేంద్రప్రభుత్వం ద్వారా వచ్చే నిధుల గురించి వాటిని ఎలా పంచాయతీలకు ఖర్చు చేయాలి, జీపీడీపీ ప్లాన్ ఏ విధంగా అమలుపరచాలి అనే అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దావీదు, వైద్యాధికారి వినీత్‌కుమార్ రాజు, పంచాయతీరాజ్ ఏఈ నారాయణరెడ్డి, ఉపాధి ఈసీ ఖాజా, ఏపీఎం సీతారామిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు సుగుణ, ఏవో కౌశిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అల్లాబకాష్, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ,ఉపాధి,వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామీణాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంపీడీవో సైదున్నీసా ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామీణ అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమం మండల ప్రాథమిక డెవలప్‌మెంట్ ప్రణాళిక సంబంధించి మండలస్థాయిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి ప్రణాళిక నిర్వహణపై క్లుప్తంగా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సర్పంచులు పి.మత్తయ్య, సుధాకర్‌రెడ్డి, గురుశేఖర్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం ఈవోపీఆర్‌డీ శివారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచులు అంబవరం రామయ్య, గురుశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మత్తయ్య, మునెమ్మ, కార్యాలయ సిబ్బంది, మండల మహిళా సమాఖ్య అధికారులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

రైతులను దగా చేసిన చంద్రబాబు : మాజీ ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ఎన్నికల హామీలను తుంగలో తొక్కి రైతులను దగా చేశారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి విమర్శించారు. శనివారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చంద్రబాబు రైతులకు ఇచ్చిన బాండ్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ 2014-2019 మధ్యలో రైతులకు రుణమాఫీ చేస్తానని బాండ్లు మంజూరు చేశారన్నారు. అయితే కేవలం రెండు సంవత్సరాలకు మాత్రమే రైతులకు రుణమాఫీ మొత్తాలను అందజేశారన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో వరి, చీనీ, శనగ, పత్తి రైతులకు గతంలో ఇన్సూరెన్స్ మంజూరైందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం రైతుల నుంచి బీమా ప్రీమియం చెల్లించాలని పేర్కొంటోందన్నారు. రైతుల బీమాతో సంపద సృష్టిస్తున్నారా అని ప్రశ్నించారు



చంద్రబాబు 2014లో రైతులకు ఇచ్చిన రుణమాఫీ బాండ్లను ప్రదర్శిస్తున్న దృశ్యం

తహసీల్దారుగా బాధ్యతల స్వీకరణ


అట్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు తహసీల్దారుగా సుబ్బలక్షుమ్మ బాధ్యతలు చేపట్టారు. ఐదు నెలలుగా మండలానికి తహసీల్దారు లేకపోవడంతో భూ సమస్యలు అధికంగా ఉండడంతో కొత్త తహసీల్దారు భూ సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. అనంతపురం జిల్లా నుంచి అట్లూరుకు బదిలీపై రావడం జరిగిందని తహసీల్దారు తెలిపారు. శనివారం బాధ్యతలు చేపట్టిన తహసీల్దారుకు డిప్యూటీ తహసీల్దారు శిరీషా, ఆర్ఐ రమణ పుష్పగుచ్ఛం ఇచ్చారు.



తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన సుబ్బలక్షుమ్మ

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు

• ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులుచురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. ఉచిత ఇసుక సమస్యలు ప్రభుత్వం దృష్టికి రాగా ఉదయం 6 గంటలల నుంచి సాయంత్రం 6 గంటలలోపు అవసరమైనమేరకు తోలుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో ఇసుక తరలించినవారిపైన కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయాలని పోలీసులకు తెలిపారు. ఎక్స్‌కవేటర్లు పెట్టుకుని ఇసుక డంప్ చేయరాదని, త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులుజారీ చేస్తుందని తెలిపారు. అవసరాల మేరకు ఉచిత ఇసుక తీసుకుని వెళ్లవచ్చన్నారు. జగన్ చేసిన అప్పుల కారణంగా ప్రభుత్వం ఇంకా కోలులేదన్నారు. అభివృద్ధిలో భాగంగా మైదుకూరు, ఎర్రగుంట్ల రోడ్లను విస్తరణ చేస్తున్నామన్నారు. ప్రొద్దుటూరులోని నాలుగు ప్రధాన కాలువల సర్వే జరుగుతుందని, అనంతరం అక్రమ కట్టడాలను తొలగించి డ్రైనేజీ, రోడ్డు విస్తరణ పనులు చేపడుతామన్నారు. గత ప్రభుత్వ హయంలో ఇసుక దోపిడీకి గురైందన్నారు.


'శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి'



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధికి శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలని రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు పేర్కొన్నారు. శనివారం శ్రీబాగ్ ఒప్పందాన్నిఅమలు చేయాలని తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ మహమూద్, విరసం సభ్యురాలు వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు యల్లయ్య, మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, విద్యార్థిశక్తి కన్వీనర్ హరిత, సృజన సామాజికవేత్త కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, పీకేఎస్ కన్వీనర్ నాగేంద్ర, జగదీష్, శ్రీను, ఇస్మాయిల్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందజేత



ప్రథమ బహుమతి టీవీని సుధాకర్‌రెడ్డికి అందజేస్తున్న షోరూం ఎండీ మహేంద్రారెడ్డి, జీఎం సందీప్‌కుమార్

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి పండుగల సందర్భంగా ఎంఆర్‌హోండా షోరూంలో లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందజేశారు. శనివారం ఆసంస్థ ఎండీ ముమ్మడిరెడ్డి మహేంద్రారెడ్డి విజేతలకు బహుమతులు అందించారు. మొదటి బహుమతి టీసీఎల్ 55 గూగుల్ టీవీ సుధాకర్‌రెడ్డికి అందించారు. రెండో బహుమతి ఫ్రిజ్ పులివెందులకు చెందిన ప్రశాంతికి, మూడో బహుమతి అయ్యవారిపల్లెకు చెందిన రమేష్‌కు వాషింగ్‌మిషన్ అందజేశారు. 20 మందికి కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మడిరెడ్డి నరేంద్రారెడ్డి, జనరల్ మేనేజర్ సందీప్‌కుమార్, సేల్స్‌మేనేజర్ గోపీనాథరెడ్డి, ఏజీఎం షేక్షావలి, షోరూం సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

బద్వేలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎన్‌జీవో హోంలో నిర్వహించిన ఆర్ఎస్‌యూ10వ జిల్లా మహాసభకు హాజరైన ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతిగృహాలలో సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి రవిశంకర్‌రెడ్డి, ప్రశాంత్, ఉపాధ్యక్షుడు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

